క్లుప్తంగా...

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో దివ్యాంగులకు సోమవారం డ్వాక్రా భవన్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సమితి ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. దివ్యాంగుల బస్ పాస్ మేళాను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐడీ కార్డు, పాస్‌ఫోటోతో హాజరు కావాలని తెలిపారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో మాక్ ఇంటర్వ్యూ



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఆరో సెమిస్టర్ చదవుతున్న విద్యార్థులు మాక్ ఇంటర్వ్యూ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలలో చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి పూర్వ విద్యార్థులను అభినందించారు.

క్రీడా ప్రాంగణం ప్రారంభం



క్రీడాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న పార్కులను అభివృద్ధి పరచి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు మున్సిపల్ నిధులను వెచ్చిస్తామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం 5వ వార్డు సాయిప్రతాప్ కాలనీలోగల పార్కుతో పాటు, క్రీడాప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు.

నూతన కమిటీ ఎన్నిక



సంఘం నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

మేడ్చల్ రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలో ఆదివారం గ్రామ నాయకుడు కుతాడి నరేందర్ ఆధ్వర్యంలో ఎస్టీ కులస్తులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన సంఘం ఏర్పాటు చేసి గ్రామ ఎస్టీ సంఘం అధ్యక్షుడిగా మాలోత్ సందీప్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా చంటిబాబు, కార్యవర్గ సభ్యులుగా మాలోత్ కములమ్మ, కుతాడి పద్మ,మాలోత్ చాందిని, సుశీలను ఎన్నుకున్నారు.

రోడ్లపై పాదయాత్రలు చేస్తే ఓట్లు పడవు

- మంత్రి చామకూర మల్లారెడ్డి



తాగునీటి సరఫరా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: కాంగ్రెస్, బీజేపీ పార్టీల అధ్యక్షులు పాదయాత్రల పేరుతో రోడ్లపై తిరిగితే ప్రజలు ఓట్లు వేయరని, బీఆర్ఎస్ మాదిరిగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్‌లో ఆదివారం ఆయన కనక దుర్గ కాలనీ ఫేస్1, 2, 3, 4, 5లో అణుశక్తినగర్, శ్రీహరి ఎన్‌క్లేవ్, జై శ్రీరాంనగర్, కాలనీల్లో మిషన్ భగీరథ్ కింద చేపట్టి తాగునీటి సరఫరాను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు రోడ్లపై తిరుగుతూ తాము చేపట్టిన పనుల్లో లోపాలను ఎత్తిచూపుతూ విమర్శలు చేస్తున్నారన్నారు. 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఎప్పుడైనా తాగునీరు ఇచ్చిందా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తాగునీరు, పింఛన్లు, ప్రజల బాధలు అర్థం చేసుకుని వారి సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, నేతలు కొత్త రవిగౌడ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కల నెరవేరేనా..!

ఈ విద్యా సంవత్సరంలోనైనా వచ్చేనా..

- డిగ్రీ కళాశాల మంజూరుకు ఎదురు చూస్తున్న ప్రజలు
- ఉన్నత విద్యకు దూరమైన పేద విద్యార్థులు
- ప్రతీ ఏడాది ఏదో ఒక సాకు చూపుతున్న నేతలు
- మేడ్చల్ డిగ్రీ కళాశాలకు వీడని గ్రహణం



డిగ్రీ కళాశాల కోసం విద్యార్థి సంఘాల ధర్నా(ఫైల్)

మేడ్చల్: మేడ్చల్ పరిసర ప్రాంతాల పేద విద్యార్థులు ఉన్నత చదువు చదువుకోవాలనే ఆశ ఏళ్ళుగా నేరవేరడం లేదు. మేడ్చల్ నియోజకవర్గం లో 4 లక్షలకు మందికిపైగా ఉన్న జనాభా ఉన్నా ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మాత్రం మంజూరు చేయడం లేదు. ఏళ్ళుగా పేద విద్యార్థుల కోసం విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా ఫలితం మాత్రం రావడం లేదు. గత ఎన్నికల సమయంలో మేడ్చల్, ఘట్‌కేసర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని, మంజూరు ఆలస్యమైతే తన ఇంజినీరింగ్ కళాశాల భవనాల్లో ఒక భవనం కేటాయించి తాత్కాలిక కళాశాల ఏర్పాటు చేస్తానని మాటలు చెప్పి ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి మల్లారెడ్డి మంత్రి అయినా.. డిగ్రీ కళాశాల కోసం మాత్రం పట్టించుకోలేదు. ఎమ్మెల్యేగా గెలిచిన మొదట్లో వరుస ఎన్నికలు రావడంతో ఫైల్ పెండింగ్‌లో ఉందని, రెండవ సంవత్సరం కరోనా రావడంతో ఆలస్యమవుతుందని మంత్రి మల్లారెడ్డి పలుమార్లు చెప్పారు. సీఎం కేసీఆర్ వద్ద ఫైల్ ఉందని త్వరలో మంజూరు చేయిస్తానని ఎవరు అడిగినా కొత్తగా చెబుతున్నారు.2021లో మేడ్చల్ లో పర్యటించిన విద్యాశాఖా మంత్రి సబితాఇంద్రారెడ్డి 2022 లో మేడ్చల్ కు డిగ్రీ కళాశాల వస్తుందని చెప్పినా అది మాటలకే పరిమితమైంది.

- మేడ్చల్ , శామీర్‌పేట్, మెదక్,సంగారెడ్డి, సిద్దిపేట్ జిల్లాల శివారు మండలాల ప్రాంతాల విద్యార్థులు మేడ్చల్‌లోనే ఎక్కువగా విద్యనభ్యసిస్తున్నారు. మేడ్చల్‌లో ఒకటవ తరగతి నుండి ఇంటర్ వరకు ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి. ఇంటర్ వరకు పేద విద్యార్థులు తమ చదువులను మేడ్చల్ లోనే సాగిస్తు ఉన్నత చదువుల కోసం నగరానికి వెళ్ళలేక చదువులు సగంలోనే మానేస్తున్నారు.

విద్యార్థుల పోరాటలు వృథా..

విద్యార్థి సంఘాల నాయకులు ఏళ్ళతరబడి డిగ్రీ కళాశాల కోసం ఉద్యమాలు చేస్తున్నా మంజూరు మాటలకే పరిమతమవుతుంది.రెండేళ్ళ క్రితం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రెండు డిగ్రీ కళాశాలలు మంజూరైనా అవి మేడ్చల్‌కు రాలేదు. ఉప్పల్, రాజేంద్రనగర్‌లకు వెళ్ళడంతో గత సంవత్సరం మేడ్చల్ కు భంగపాటు తప్పలేదు. ఈ నూతన సంవత్సరంలోనైనా మేడ్చల్ కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరవుతుందని స్థానికులు ఆశలు పెట్టుకున్నారు.

పోరాటాలు చేస్తున్నా నాయకులు స్పందించడం లేదు

దాదాపు 20 ఏళ్ళుగా మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల కోసం విద్యార్థి సంఘాలు ఐక్యమై పోరాటాలు చేస్తున్నా పాలకులు మాత్రం స్పందించడం లేదు. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థుల రాతలు మారడం లేదు.

– సంతోష్ రాథోడ్, జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఎన్నికల హామీగానే డిగ్రీ కళాశాల అంశం

మేడ్చల్ ప్రాంతంలో ఏ ఎన్నికొచ్చినా డిగ్రీ కళాశాల అంశం ఎన్నికల హమీగా మారింది. ఎన్నికల నిలబడే ప్రతి నాయకుడు నేను గెలవగానే డిగ్రీ కళాశాల తేస్తా అని చెబుతూ గెలిచాక ఏ నాయకుడూ పట్టించుకోవడం లేదు.

– రాహుల్ యాదవ్, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కానపురం సాయికృష్ణ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మాట్లాడుతూ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ తోటకూర వజ్రేష్‌యాదవ్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ ద్వారానే మహిళకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న కవిత

మేడ్చల్: బీజేపీ ద్వారా ఏర్పడే ప్రభుత్వాల వల్లే మహిళలకు భరోసా ఏర్పడుతుందని తమిళనాడు రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవితా శ్రీకాంత్ అన్నారు. పార్టీ చేపట్టిన ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఒక సెల్ఫీ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ పట్టణంలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. విద్యార్థులకు అందుతున్న పోషకాహారం, వసతులు, వంటి విషయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల బీజేపీ మహిళా కౌన్సిలర్లు హంసకృష్ణగౌడ్, లావణ్య హన్మంత్‌రెడ్డి, నాయకురాళ్ళు, అనిత,విజయలక్ష్మీ పాల్గొన్నారు.

కేంద్రం వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



మేడ్చల్‌లో కార్మిక సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని ప్రతి కార్మికుడూ ప్రతిఘటించాలని బీఆర్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. మేడ్చల్‌లోని మంత్రి మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో జిల్లా బీఆర్‌టీయు ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం తీసువచ్చిందని అన్నారు. కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ సెక్టార్‌ను ప్రైవేటు పరం చేస్తూ కార్మికులకు అన్యాయం చేసుతదని అన్నారు. సమావేశంలో జిల్లా బీఆర్‌టీయు అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కీసర: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో గౌడసంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌నేతలు గూడరు అంజన్న, సాయినాథ్‌గౌడ్, మధుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో ..



జవహర్‌నగర్: జవహర్‌నగర్ మహనీయుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహనీయుల కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఏకే.మురుగేష్, మహనీయుల కమిటీ ప్రధాన కార్యదర్శి పరుశురాం పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభోత్సవం

కుషాయిగూడ: చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగపురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు న్యూస్‌పేపర్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు, యువకులు గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సెక్రటరీ రవీందర్‌రెడ్డి, శివరాములు, సోములు, శ్రీనివాస్‌గౌడ్, రాం మోహన్, వెంకట్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు నవీన్‌గౌడ్, రామకృష్ణ, కృష్ణవేణి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మల్లాపూర్: యువత క్రీడాల్లో రాణించాలని మల్లాపూర్ కార్పొటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ తరపున యువతకు మల్లాపూర్ వార్డు కార్యాలయంలో క్రీడా సామగ్రిని ఆదివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడాల్లో రాణించాలన్నారు. క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్లు, టెన్నికాయిట్లు, చెస్ బోర్డులు, చెస్ కాయిన్స్, టెన్నిస్ బాల్స్ అందజేశారు. కార్యక్రమంలో పీఆర్.ప్రవీణ్, శాంతి యూత్‌క్లబ్ ప్రతినిధులు సూర్యనగర్ కాలనీ యూత్ సభ్యులు, కొల్లూరి రవికిరణ్, రఘు, సాయిరెడ్డి, ఆఫ్రోజ్, శశి, వీరేశ్, శివరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలో పయనించాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న సురేశ్‌నాయక్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: ప్రబుద్ధ భారత్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల సమర్పించారు. ముఖ్య అతిథులుగా పోచారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సురేశ్‌నాయక్, ఉపాధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, తౌర్యనాయక్, కార్యదర్శి మల్లేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ కొన్ని వర్గాల కోసం కాకుండా దేశంలోని సబ్బండ వర్గాల కోసం రాజ్యాంగాన్ని రచించారని, ఆయన మార్గంలో పయనించడానికి యువత ముందుకు రావాలన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కుల, మత, లింగ బేధం లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, మేకల దాసు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి



వినయ్ కుమార్ (ఫైల్)

ఘట్‌కేసర్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో జిల్లా పరిషత్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం అర్థరాత్రి చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. భువనగిరికి చెందిన వినయ్‌కుమార్ (30) భువనగిరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు పూర్తి కాగానే ఫాసినో బైక్‌పై ఉప్పల్‌కు వెళ్లి తిరిగి భువనగిరికి బయల్దేరాడు. అర్థరాత్రి అవుషాపూర్ రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి వినయ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎంపీఎల్-3 విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మంగమ్మ

ఘట్‌కేసర్: మర్పల్లిగూడలో నిర్వహించిన మర్పల్లి గూడ ప్రీమియర్ లీగ్–3 (ఎంపీఎల్) విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం జరిగిన తుది పోరులో ఎంపీఎల్ చాంపియన్స్ జట్టు, ఎంపీఎల్ రైడర్స్ జట్లు తలపడగా చాంపియన్స్ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మంగమ్మ హాజరై విజేత చాంపియన్స్ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేశ్, వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్ పోచిరెడ్డిసర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామంలో సర్పంచ్ కావేరి, వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ పోచిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికులు, స్థానికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రయాణికులకు, స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, సదానంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సాయిలు, రాజిరెడ్డి, మల్లేశ్, దామోదర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

జీడిమెట్ల: ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్ సమీపంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సహకారంతో అడపశేషు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ క్యాంపును సురేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత మెడికల్ క్యాంపులు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో సహాయపడతాయన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు కోసం సహాయ సహకారాలు అందించిన సృజన ఆస్పత్రి వారికి సురేష్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ డాక్టర్లు భరత్‌కాంత్‌రెడ్డి, శ్రీలీల మాధురి, చెన్నకేశవ, లత, విజయ్, శీను, వెంకటేశ్వరరావు, హరీష్, వాజిద్, లక్ష్మణ్, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

చేపా..చేపా.. ఏదీ నీ చిరునామా?

- చెరువుల్లో చేప పిల్లలు నిరుపయోగమట
- వేయకుండానే.. నిధులు స్వాహా పర్వం
- మార్కెంటింగ్ ఏజెన్సీలు, సంఘాల సభ్యుల పేరుతో చేతివాటం
- ఉన్నతాధికారులకు అనుమానం రాకుండా జిల్లా మత్స్యశాఖ నివేదిక
- వంద చెరువులను టి–మత్స్య నుంచి తొలగించాలని లేఖ
- రేపు జిల్లాకు రానున్న అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి వ్యవహారం

సాక్షి, మేడ్చల్ జిల్లా: చేపల చెరువు కథ అడ్డం తిరుగుతోంది. నిరుపయోగమైన చెరువుల్లో చేప పిల్లలను వేసినట్లు సాక్షాత్తు సంబంధిత శాఖ రికార్డు సృష్టించి నిధులు స్వాహా చేయడం కలకలం రేకెత్తిస్తోంది. నాలుగేళ్లుగా పనికి రాని కాలుష్య భరితం, పిచ్చి చెట్లమయమైన చెరువులు మధ్యలో ఒక ఏడాది చేప పిల్లల పంపిణీకి ఏలా అవసరమయ్యేయో అంతు చిక్కని ప్రశ్నగా మారింది. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు సాక్షాత్తు జిల్లా మత్స్యశాఖలోని కొందరు ఉద్యోగులు ప్రదర్శించిన చేతివాటం చర్చనీయంశమైంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో నిరుపయోగమైన చెరువులు, కుంటల్లో వేలాది చేప పిల్లలు వదిలినట్లు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది

నాలుగేళ్ల నుంచి పనికిరానివి..

సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద చేపల వృత్తే జీవానాధారంగా బతుకుతున్న మత్స్యకారులు, గంగపుత్రులు తదితర సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం చెరువులు, కుంటల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. చేప పిల్లల కొనుగోలుకు అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరించి చెరువుల్లో ఉచితంగా వదులుతోంది. అందులో భాగంగా 2018–19 నుంచి 233 చెరువులు, కుంటల్లో ప్రతీ ఏటా మత్స్యశాఖ ఆడంబరంగా నిర్వహిస్తూ వస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులకు సమర్పించిన నివేదికలో సైతం జిల్లా మత్స్యశాఖ స్పష్టం చేసింది. అయితే.. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 333 చెరువుల్లో చేప పిల్లలు వదిలినట్లు పేర్కొంది. ప్రతి యేటా కంటే గత ఏడాది అధిక చెరువుల్లోకి చేప పిల్లల పంపిణీ అనుమానాలకు గురిచేసింది. ఈ విషయంపై మత్స్యశాఖ వర్గాలతోసహా గంగపుత్రులు, ముదిరాజ్‌లు, మత్స్యకారులు సైతం పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

దిద్దుబాటు చర్యలకు

జిల్లా మత్స్యశాఖ తమ తప్పిదాన్ని బయటపడ కుండా ఉండేందుకు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 333 చెరువుల్లో చేప పిలలను వదిలేందుకు నీరు సమృద్ధిగా ఉందని సమర్థించుకుంటూనే 2022–23లో మాత్రం 233 చెరువుల్లో మాత్రమే 69 లక్షల చేప పిల్లలను వదిలినట్లు పేర్కొంటుంది. గతంలో చేప పిల్లలను వదిలి వేసిన పాత వంద చెరువులు అనుకూలంగా లేని కారణంగా వాటిని టి–మత్స్య నుంచి తొలగించాలని రాష్ట్ర కమిషనర్‌కు ఈ ఏడాది జనవరి 12న లేఖ రాయడం మరింత అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

ఇదిగో మచ్చుతునకలు

జిల్లాలోని వెన్నెలగడ్డ(జీడిమెట్ల), మేడికుంట(బాచుపల్లి), నల్లచెరువు(ఉప్పల్), సందుకుంట(బహదూర్‌పల్లి), చింతకుంట(డి.పోచంపల్లి) చెరువులు పనికి రానివిగా ఉండటంతో 2018–19 నుంచి వాటిలో చేప పిల్లల పంపిణీ చేపట్టటం లేదని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. 2021–22లో నిరుపయోగమైన వంద చెరువుల్లో 6.21 లక్షల చేపపిల్లల పంపిణీ కి రూ.4 లక్షల నిధులు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

- చేప పిల్లలను సరఫరా చేసే మార్కెంటింగ్ ఏజెన్సీల పేరుతో బిల్లులు సృష్టించి , పలు సొసైటీల సభ్యులు, ఏజేన్సీల ప్రతినిధుల సంతకాలను సాక్షాత్తు జిల్లా మత్స్యశాఖలోని పలువురు ఉద్యోగులు ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ అవినీతి భాగతంలో ఒక జిల్లా స్థాయి అధికారితోసహా ముగ్గురి ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు ఆ శాఖ వర్గాలతోపాటు మత్స్యకారులు,గంగపుత్ర సహకార సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి ..

మంగళవారం జిల్లాకు రానున్న రాష్ట్ర మత్స్యశాఖ అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి చేప పిల్లల పంపిణీ చేతివాటం వ్యవహారాన్ని తీసుకెళ్లేందుకు కొన్ని సొసైటీలు, మత్స్యకారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. నిరుపయోగమైన వంద చెరువుల్లో చేప పిల్లలను వదలినట్లు చేతివాటం ప్రదర్శించడంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ,తగిన చర్యలు తీసుకోవాలని పలువురు మత్స్యకారులు,సహకార సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.